E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
23-3-2025 ఆదివారం | పేజీలు–6 | హైదరాబాద్
ekaburu.com



నిరుద్యోగులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ 2లో

# డీలిమిటేషన్‌తో రాజకీయ అధికారాలను కోల్పోతాం

- పార్లమెంటులో సీట్లు తగ్గే అవకాశం
- అభివృద్ధి, నిధుల కేటాయింపుపై ప్రభావం
- జనాభా నియంత్రణకు శిక్షలా?
- పార్లమెంటులో సీట్లు తగ్గుదల
- చట్టాల రూపకల్పనలో ప్రభావం
- దక్షిణాది ఉత్తరాది అసమతుల్యత



**జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుందని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆరోపించారు.**

**ఈ-కబురు చెన్నై:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం శనివారం ప్రారంభమైంది. ఇందులో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆరోపించారు. సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామని అన్నారు.

"డీలిమిటేషన్‌పై ఈ అఖిలపక్ష భేటీ చరిత్రాత్మకంగా నిలిచిపోతుంది. ప్రస్తుతమున్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. దీన్ని మనమంతా వ్యతిరేకించాలి. పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యం పడిపోతే.. అభిప్రాయాలను వ్యక్తీకరించే బలం తగ్గుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల కోసం మనం పోరాటం చేయాల్సి వస్తుంది. మన సమ్మతితో సంబంధం లేకుండానే చట్టాలు రూపొందుతాయి. ఆ నిర్ణయాలు **తరువాయి 2లో**



## సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తాం

**రాబోయే రోజుల్లో అధికారం మళ్లీ భారాసదే అని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.**

**ఈ-కబురు సిద్దిపేట:** రాబోయే రోజుల్లో అధికారం మళ్లీ భారాసదే అని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. గోదావరిఖని నుంచి మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్ర కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందంతో సమావేశమైన కేసీఆర్.. కీలక వ్యాఖ్యలు చేశారు.

బెల్లం ఉన్న దగ్గరకే ఈగలు వచ్చినట్టుగా.. తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేవని.. ఇప్పుడు రాష్ట్రం సమస్యల వలయంలో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది భారాస మాత్రమేనని పేర్కొన్నారు. అందరూ ఒక్కో కేసీఆర్‌ల తయారు కావాలన్నారు. కాంగ్రెస్ నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.



## తెలంగాణకు 42పైసలే.. బిహార్‌కు మాత్రం రూ.6.06: సీఎం రేవంత్

**కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.**

2లో



## రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే.. పార్టీ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు: రాజాసింగ్

3లో

## డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి: కేటీఆర్

**డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

2లో



## ఎస్ఎల్‌బీసీ ఘటన.. కార్మికుల వెలికితీతలో ఎందుకింత జాప్యం?: హరీశ్‌రావు




2లో



6లో

## డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతాకు షాక్ ఇచ్చిన ఆర్సీబీ

## ట్రంప్ 'గోల్డ్ కార్డ్'కు భలే గిరాకీ.. ఒక్కరోజే 1000 విక్రయం!



2లో

## లద్దాఖ్ భూభాగంలో చైనా కౌంటీలు.. దురాక్రమణను అంగీకరించబోమన్న భారత్



## దిల్లీ బడ్జెట్.. 10 వేల సూచనలు అందాయి




**త్వరలో ప్రవేశపెట్టనున్న దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు సీఎం రేఖాగుప్తా వెల్లడించారు.**

**ఈ-కబురు** :త్వరలో ప్రవేశపెట్టనున్న వికసిత్ దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. ఇందులో మహిళల ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, యమునా నది ప్రక్షాళన, కాలుష్యం వంటివాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం 'ఖీర్' వేడుకతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దేశరాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. మార్చి 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

**డీలిమిటేషన్‌తో రాజకీయ అధికారాలను కోల్పోతాం: అఖిలపక్ష భేటీలో స్టాలిన్**

బడ్జెట్‌ను సిద్ధం చేసే ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖా గుప్త తెలిపారు. ప్రజల నుంచి మెయిల్ ద్వారా 3,303 సూచనలు రాగా.. వాట్సప్ ద్వారా 6,982 సూచనలు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందిస్తామని అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం దిల్లీని అభివృద్ధి బాటలో నడుపుతుందని పేర్కొన్నారు.

## హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు



**ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు.**

2లో

## ఆలు లేదు.. చూలు లేదు.. డీలిమిటేషన్‌పై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



2లో

# తెలంగాణకు 42 పైసలే.. బిహార్‌కు మాత్రం రూ.6.06: సీఎం రేవంత్



**ఈ-కబురు చెన్నై:** కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

'తెలంగాణలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాధించాం. తెలంగాణలో సుపరిపాలనతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి. తమిళనాడుకు 26 పైసలు, కర్ణాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. యూపీకి రూ.2.03, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 మేర లభిస్తోంది'' అని రేవంత్‌రెడ్డి వివరించారు.

''రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. డీలిమిటేషన్.. రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని ఈ విధానంపై భాజపాను కట్టడి చేయాల్సి ఉంది. లోక్‌సభ సీట్లు పెంచవద్దు.. రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలి. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారు. ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలి. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు. ఇలా చేస్తే దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుంది. దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నాం. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం'' అని రేవంత్ స్పష్టం చేశారు.

## నిరుద్యోగులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

**తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి సర్కార్ నిరుద్యోగులపై ఎక్కువ దృష్టి సారించింది. కొద్ది రోజుల క్రితమే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఇప్పుడు మరో సారి నిరుద్యోగ యువతకు శుభవార్త చెప్పింది.**




**ఈ-కబురు** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రెవెన్యూ శాఖలో కొత్తగా గ్రామ పాలన అధికారుల పోస్టులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు జీపీఓగా నామకరణం చేసింది. మొత్తం 10,924 పోస్టులను మంజూరు చేసింది. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి ఆప్షన్లు తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల టైంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఆరు హామీల్లో భాగంగా ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అండగా నిలవడానికి ప్రభుత్వం కొద్ది రోజుల క్రితమే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 5 లక్షల మందికి ఏకంగా 6 వేల కోట్ల రాయితీ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది నిరుద్యోగ యువత లబ్ధి పొందనున్నారు. ఈ పథకంలో భాగంగా ఒక్కో లబ్దిదారుడికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారు. తీసుకునే లోన్ అమౌంట్ బట్టి రాయితీ 60 నుంచి 80 శాతం వరకు వస్తుంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 6వ తేదీనుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుంది. జూన్ 2వ తేదీన రాయితీ రుణాలు మంజూరు చేస్తారు.



## లద్దాఖ్ భూభాగంలో చైనా కౌంటీలు.. దురాక్రమణను అంగీకరించబోమన్న భారత్

**లద్దాఖ్ భూభాగంలో చైనా కౌంటీలు ఏర్పాటుచేస్తుండటంపై కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ దురాక్రమణను అంగీకరించబోమని స్పష్టంగా చెప్పింది.**

**ఈ-కబురు దిల్లీ:** భారత్‌తో సరిహద్దు వివాదం పరిష్కారానికి ఓవైపు చర్చల దిశగా ప్రయత్నాలు జరుగుతున్న వేళ.. చైనా మరోసారి కవ్వింపులకు పాల్పడింది. లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటుచేస్తోంది. ఈ విషయంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి దురాక్రమణను ఎన్నటికీ అంగీకరించబోమని స్పష్టంచేసింది.

''చైనా రెండు కొత్త కౌంటీలను ఏర్పాటుచేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆ కౌంటీల్లోని కొన్ని భాగాలు లద్దాఖ్ పరిధిలోకి వస్తాయి. భారత భూభాగాలను ఆక్రమించడాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబోం. భారత సార్వభౌమాధికారానికి సంబంధించి మా దీర్ఘకాల, స్థిరమైన వైఖరిపై ఈ కౌంటీల ఏర్పాటు ఎలాంటి ప్రభావం చూపించదు. ఈ చర్యలు.. చైనా చేపడుతున్న బలవంతపు ఆక్రమణలకు చట్టబద్ధతను కల్పించలేవు'' అని కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంట్‌కు వెల్లడించారు. దీనిపై భారత్ నిరసనను దౌత్యమార్గాల ద్వారా తెలియజేశామని పేర్కొన్నారు.

చైనా కౌంటీల నిర్మాణంపై కేంద్రానికి సమాచారం ఉందా?అన్న ప్రశ్నకు బదులిస్తూ విదేశాంగ శాఖ ఈ మేరకు వివరణ ఇచ్చింది. కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా తమకు సమాచారం ఉందని వెల్లడించింది. ఈ సందర్భంగా సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై భారత్ ప్రత్యేక దృష్టిసారించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ''భారత వ్యూహాత్మక, భద్రతా అవసరాలకు అనుగుణంగా సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అదనపు దృష్టి సారించాం. ఇందుకోసం గత దశాబ్ద కాలంలో బడ్జెట్ కేటాయింపులను కూడా పెంచాం. సరిహద్దు రహదారుల సంస్థకు గతంలో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువగా నిధులు అందిస్తున్నాం. సొరంగాలు, వంతెనలను నిర్మిస్తున్నాం'' అని కీర్తి వర్ధన్ సింగ్ తన సమాధానంలో పేర్కొన్నారు.



## ఆలు లేదు.. చూలు లేదు.. డీలిమిటేషన్‌పై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

**ఈ-కబురు హైదరాబాద్:** డీలిమిటేషన్‌కు విధివిధానాలు ఇంకా ఖరారే కాలేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు తీరు ఆలు లేదు.. చూలు లేదు.. అన్నట్లుగా ఉందంటూ చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ సమావేశంపై ఆయన వ్యాఖ్యానించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజ్యసభ ఎంపీ డా.లక్ష్మణ్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాదికి అన్యాయం అంటూ అపోహలు సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే అపోహలు సృష్టిస్తున్నాయని దుయ్యబట్టారు. బీజేపీపై విషం కక్కడమే వారి అజెండా అని.. దక్షిణాదిపై మోదీకి ప్రత్యేకమైన ప్రేమ ఉంది. ఏ ఒక్క రాష్ట్రానికి అన్యాయం జరగదని కిషన్‌రెడ్డి అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నా పార్టీ బీజేపీ. దక్షిణాది అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోంది. దక్షిణ భారతదేశానికి సంబంధించి వీళ్ల సర్టిఫికెట్ అవసరం లేదు'' అంటూ కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ''అన్ని ప్రాంతాలకు బీజేపీ సమ న్యాయం చేస్తోంది. స్టాలిన్‌కు దురద పుడితే రేవంత్, కేటీఆర్ వెళ్లి గోకుతున్నారు. డీలిమిటేషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే లేని పోని హడావుడి చేస్తున్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం కేంద్రం మీద బురద చల్లుతున్నారు'' అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి: కేటీఆర్

**ఈ-కబురు చెన్నై:** డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ అంశంపై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

''దక్షిణాది రాష్ట్రాలపై భాజపా ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతుంది. కేంద్రం చూపించే వివక్షతో దక్షిణాది పూర్తిగా నష్టపోతుంది. జనాభా ఆధారంగా సీట్లు పెంచడం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం. ఈ విధానాన్ని అవలంబిస్తే అనేక నష్టాలున్నాయి. దేశాభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుంది. డీలిమిటేషన్ విధానాన్ని అనుసరించడం ద్వారా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉంది'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## భారత్‌లో గ్రోక్ హిందీ తిట్ల వివాదం.. మస్క్ రియాక్షన్

**హిందీ తిట్లతో బదులు ఇస్తోందని ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్‌పై వస్తున్న ఆరోపణలపై ప్రపంచ కుబేరుడు స్పందించారు.**

**ఈ-కబురు:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్‌ఏఐ గ్రోక్ ఏఐ చాట్‌బాట్ సేవల్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల కొందరు యూజర్లు అడిగిన ప్రశ్నలకు గ్రోక్ హిందీ యాసలో కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సామాజిక మాధ్యమాల్లో వివాదానికి దారితీసింది. తాము అడిగిన ప్రశ్నలకు గ్రోక్ హిందీ తిట్లతో బదులిస్తోందని యూజర్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. సినిమాలు, రాజకీయాలు, క్రీడలపై ఏఐ చాలా నిజాయతీగా సమాధానమిస్తోందని పలువురు నెటిజన్లు పేర్కొటున్నారు.

ఈనేపథ్యంలో భారత్‌లో గ్రోక్ ఏఐ తుపాను సృష్టిస్తోంది అంటూ ఓ అంతర్జాతీయ మీడియాలో కథనం వెలువడింది. దీనికి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందించారు. ఆ నివేదికను షేర్ చేస్తూ.. నవ్వుతున్న ఎమోజీతో రిప్లై ఇచ్చారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నరకాలుగా స్పందిస్తున్నారు. మస్క్ పోస్ట్‌కు అర్థమేంటని ఓ నెటిజన్ ఏఐ చాట్‌బాట్‌ను ప్రశ్నించగా.. భారత్‌లో నెలకొన్న ఈ రాజకీయ వివాదం నవ్వు తెప్పించేదిగా ఉందని ఆయన భావిస్తున్నట్లు పేర్కొంది.

**లద్దాఖ్ భూభాగంలో చైనా కౌంటీలు.. దురాక్ర-మణను అంగీకరించబోమన్న భారత్**

మస్క్‌కు చెందిన 'ఎక్స్‌ఏఐ ' ఈ గ్రోక్ చాట్‌బాట్‌ను విడుదల చేసింది. ఈ మోడల్ భూమిపైన అత్యంత తెలివైన ఏఐ సాధనంగా మస్క్ అభివర్ణించారు. ఇటీవల యూజర్లు అడుగుతున్న ప్రశ్నలకు గ్రోక్ ఇచ్చిన సమాధానాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. హిందీ యాసను సైతం ఈ ఏఐ చాట్‌బాట్ ఉపయోగిస్తుంది. అయితే, అందులో కొన్ని అభ్యంతరకర పదాలు ఉండటం వివాదానికి దారితీసింది. దీని పరిష్కారంపై కేంద్రప్రభుత్వం దృష్టిసారించింది. గ్రోక్ వివాదంపై ఎక్స్ ప్రతినిధులతో కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వశాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

మరోవైపు.. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి పేరును గ్రోక్ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు సృష్టించే వ్యక్తుల జాబితాలో చేర్చింది. దీనిపై దర్శకుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయనకు క్షమాపణలు చెప్పింది. ఇకపై అలాంటి తప్పు జరగదని.. వాస్తవాల ఆధారంగానే సమాధానాలు అందిస్తామని పేర్కొంది.

## హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు



**ఈ-కబురు దిల్లీ:** ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం. భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని.. దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. శుక్లా ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత. ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్ , సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

## ఎస్ఎల్‌బీసీ ఘటన.. కార్మికుల వెలికితీతలో ఎందుకింత జాప్యం?



**ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలి నెల రోజులు గడుస్తున్నా అందులో చిక్కుకున్న వారు ఏమయ్యారో ఇప్పటికీ తెలియని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, భారాస శాసనసభ్యుడు హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.**

**ఈ-కబురు హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికులు చిక్కుకుపోయి నెల రోజులు గడుస్తున్నా వారు ఏమయ్యారో ఇప్పటికీ తెలియని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీయడం తప్ప మిగిలిన ఏడుగురి జాడ గుర్తించలేకపోయారని విమర్శించారు. ''పొట్ట కూటి కోసం వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న వారిని తలుచుకుంటే గుండె తరుక్కుపోతోంది. వెలికితీతలో ఎందుకింత జాప్యం జరుగుతోంది. దీనిలో ప్రభుత్వ వైఫల్యం కూడా ఉంది'' అని అన్నారు.

''ఈ ప్రమాదానికి, బాధిత కుటుంబాలు అనుభవిస్తున్న తీవ్ర వేదనకు సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి. సొరంగంలో చిక్కుకుపోయిన మిగతా కార్మికుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మంత్రులు చెప్పిన గడువు కూడా తీరింది. కానీ, సహాయక చర్యల్లో చెప్పుకోదగ్గ పురోగతి మాత్రం సాధించలేకపోయారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ స్పందించాలి. వారి జాడ గుర్తించాలి. నెల రోజులుగా ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై పూర్తి వివరాలు వెల్లడించాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## డీలిమిటేషన్‌తో రాజకీయ అధికారాలను కోల్పోతాం

మొదటి పేజీ తరువాయి

మన ప్రజలపై ప్రభావం చూపుతాయి.తిపాదించారు. అంతకుముందు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. ''జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కొన్ని దశాబ్దాలుగా పలు దక్షిణాది రాష్ట్రాలు కీలక చర్యలు చేపడుతున్నాయి. ఇందుకోసం అనేక విధానాలు కూడా తీసుకొచ్చాం. కానీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం జనాభా వృద్ధి విపరీతంగా ఉంది. జనాభా నియంత్రణపై మన చర్యలకు ఎలాంటి రివార్డ్ లభించలేదు సరికదా.. ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదంలో పడ్డాం'' అని అన్నారు.

**పునర్విభజన మనకు డేంజర్ బెల్: పినరయి విజయన్**

ఈసందర్భంగా కేరళ సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ.. ''ఎలాంటి చర్చలు చేపట్టకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. అలా జరిగితే అది మనకు డేంజర్ బెల్ లాంటిదే. పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యం తగ్గితే.. దేశ సంపదలో మన వాటా కూడా తగ్గుతుంది. దీన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదు'' అని అన్నారు.

చెన్నై వేదికగా తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఈ సదస్సుకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

## ట్రంప్ 'గోల్డ్ కార్డ్'కు భలే గిరాకీ.. ఒక్కరోజే 1000 విక్రయం!

**డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు భారీ స్పందన వస్తోందని, ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు అమెరికా వాణిజ్యశాఖ మంత్రి వెల్లడించారు.**



**ఈ-కబురు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5బిలియన్ డాలర్లు సేకరించామని చెప్పారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందన్నారు.

''ప్రపంచ వ్యాప్తంగా 3.7కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10లక్షల మంది దీనిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు'' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచనే అని చెప్పారు. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే తన బాధ్యత అని, దీన్ని అమలు చేసే ప్రణాళిక తన వద్ద ఉందన్నారు.

**ఇన్వెస్టర్ వీసాతో..**

ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల మరో సందర్భంలో లుట్నిక్ మాట్లాడుతూ.. 2.5లక్షల మంది ఈ గోల్డ్ కార్డు కొనేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. EB5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నాం. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

ఈబీ5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాది మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

# బంగారం కొనుగోలు చేస్తానంటూ వ్యాపారులను బురిడీ కొట్టించిన వ్యక్తి

**50 తులాల బంగారు బిస్కెట్లు, 18వేల అమెరికన్ డాలర్లతో పరారీ**



నిందితుడు స్టీవ్ గాడ్ విన్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** బంగారం కొనుగోలు చేస్తానంటూ ఇద్దరు వ్యాపారులను బురిడీ కొట్టించిన ఓ వ్యక్తి వారి వద్ద నుంచి 50తులాల బంగారు బిస్కెట్లు, 18వేల అమెరిన్ డాలర్లతో ఉడాయించాడు. తెలివిగా ఓ అద్దాల గదిలో వ్యాపారులు బందీగా మారేలా చేసిన నిందితుడు, వ్యాపారుల కళ్ల ముందే బంగారం, డాలర్లతో చెక్కేశాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నార్సింగికి చెందిన బంగారు వ్యాపారీ చంద్రశేఖర్ నగరంలోని పలు హోటళ్లలో బస చేసే వారిని కలిసి బంగారు ఆభరణాలను విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన చంద్రశేఖర్ గచ్చిబౌలిలోని డిఎల్ఎఫ్ సమీపంలో గల సితార హోటల్ కు వెళ్లాడు. అక్కడ హోటల్లో బస చేస్తున్నడి. స్టీవ్ గాడ్ విన్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు 50తులాల బంగారం బిస్కెట్లు, 18వేల అమెరిన్ డాలర్లు కావాలని స్టీవ్ గాడ్విన్ చెప్పాడు. దీంతో అతని మాటలు నమ్మిన చంద్రశేఖర్ లింగంపల్లికి చెందిన తన స్నేహితుడైన మరో వ్యాపారి రఫీకి విషయం చెప్పాడు. స్టీవ్ గాడ్ విన్ కోరిన విధంగా బంగారం, అమెరిన్ డాలర్లను సిద్ధం చేసి ఈనెల 21వ తేదీన అతనికి ఫోన్ చేశారు. గచ్చిబౌలిలోని సెంట్రల్ మాల్ కార్యాలయం మీద ఉన్న తన కార్యాలయానికి రావాలని స్టీవ్ గాడ్ విన్ సూచించడంతో చంద్రశేఖర్, రఫీలు బంగారం, డాలర్లను తీసుకొని అక్కడికి వెళ్లారు. సెంట్రల్ మాల్ భవనం 4వ అంతస్థులో ఉన్న ఓ అద్దాల గదిలోపలికి స్టీవ్ తన వద్ద ఉన్న యాక్సెస్ కార్డుతో ఇద్దరినీ తీసుకువెళ్లాడు. అక్కడ 50తులాల బంగారం బిస్కెట్లు, 18వేల అమెరిన్ డాలర్లను తీసుకున్న స్టీవ్ గాడ్ విన్ లోపలికి వెళ్లి డబ్బు తీసుకువస్తానంటూ వెళ్లాడు. అనంతరం వ్యాపారుల కళ్లుగప్పి సదరు కార్యాలయం నుంచి పారిపోసాగాడు. ఈ విషయం గమనించిన వ్యాపారులు అక్కడి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా, యాక్సెస్ కార్డు లేకపోవడంతో అద్దాల గది నుంచి బయటపడలేకపోయారు. వీరి కళ్ల ముందే బంగారం, డాలర్లతో ఉడాయించిన స్టీవ్ కారులో అక్కడి నుంచి పరారయ్యాడు. కొద్దిసేపటి తరువాత అందులో నుంచి బయటపడిన వ్యాపారులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు ఉపయోగించిన కారుపై కూపీ లాగగా, కారును కొండాపూర్ లో అద్దెకు తీసుకున్నట్లు గుర్తించారు. కారు అద్దెకు తీసుకున్న సమయంలో నిందితుడు ఇచ్చిన పాస్ పోర్టు ఫోటో, గుర్తింపు కార్డు ఆధారంగా నిందితుడిని బెంగళూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు గాలింపు చేపట్టారు.



# రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే.. పార్టీ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు: రాజాసింగ్

**సొంత పార్టీ నేతలపై భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు.**

**ఈ-కబురు హైదరాబాద్:** సొంత పార్టీ నేతలపై భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త భాజపా అధ్యక్షుడు వస్తున్నారని చెప్పారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా, జాతీయ నాయకత్వమా అని ప్రశ్నించారు. ''రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుంది.

గతంలో మనం చూసిన అధ్యక్షుడు గ్రూప్ తయారుచేసుకొని పార్టీకి నష్టం చేశారు. కొత్త భాజపా అధ్యక్షుడు అదే గ్రూపిజం చేస్తే పార్టీకి నష్టం. ప్రస్తుతం మంచి నాయకుల చేతులు కట్టి పడేశారు. సీనియర్ నాయకులకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో భాజపా ప్రభుత్వం వస్తుంది. పార్టీ కొత్త అధ్యక్షుడు సీఎంతో రహస్య భేటీలు నిర్వహించవద్దు. సీనియర్ నేతలు, కార్యకర్తల మనసులో మాట బయటపెడుతున్నా. పార్టీ నేతలకు చెప్పాలే గానీ మీడియాకు చెప్పవద్దని కొందరు చెబుతున్నారు. పార్టీ పెద్దల దృష్టికితెచ్చినా వినకపోవడం వల్లే ప్రజల ముందు పెడుతున్నా. సీనియర్ నాయకులను భాజపా గుర్తించలేదు. నామినేటెడ్ పోస్టులను సీనియర్ నేతలకు ఇవ్వడం లేదు'' అని రాజా సింగ్ చెప్పారు.



# డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే: బండి సంజయ్

**గత పదేళ్లలో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు.**

**ఈ-కబురు హైదరాబాద్:** గత పదేళ్లలో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనూ రైతులను ఆదుకున్న దాఖలాలు లేవని చెప్పారు. ప్రస్తుతం వడగళ్ల వానతో నష్టోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో సమీక్షలు, సర్వేలు, నివేదికల పేరుతో కాలం గడిపారన్నారు. సర్వే చేసి వారం రోజుల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలిపారు.

''డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే. భారాస, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే. కేసుల నుంచి తప్పించుకునేందుకు భారాసకు కాంగ్రెస్ సహకరిస్తోంది. దిల్లీలో కలిసి ఉంటారు.. గల్లీలో కొట్లాడుకుంటారు. డీఎంకే భేటీకి రెండు పార్టీలు వెళ్లాయంటే.. ఇద్దరూ ఒక్కటా?కాదా? కేసుల విషయంలో కేసీఆర్ కుటుంబానికి ఒక్క నోటీసు కూడా ఇవ్వట్లేదు. భాజపాకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడుతున్నారు.

డీలిమిటేషన్ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. ఆరు గ్యారంటీల హామీల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. తమిళనాడులో డీఎంకే రూ.వెయ్యి కోట్ల మద్యం కుంభకోణం చేసింది. డీఎంకేను సాగనంపేందుకు అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు పక్కా ప్రణాళికతో ఇదంతా చేస్తున్నారు. దక్షిణాదిలో సీట్ల సంఖ్య తగ్గించబోమని అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. డీలిమిటేషన్‌కు ఎలాంటి నియమ నిబంధనలు పెట్టలేదని చెప్పారు. చెన్నైలో జరిగేది మాఫియా ముఠాల సమావేశం. అవినీతి, స్కామ్ పార్టీలు కలిసి భాజపాను అప్రతిష్ఠ పాలు చేసేందుకు యత్నిస్తున్నాయి.'' అని బండి సంజయ్ మండిపడ్డారు

# గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద ఘోర రోడ్డు ప్రమాదం

**పదవ తరగతి పరీక్షలు రాసి తిరిగివస్తుండగా ప్రమాదం**

**విద్యార్థిని మృతి - సోదరుడికి గాయాలు**



ప్రమాదంలో మృతి చెందిన ప్రభాతి ఛత్రియ (ఫైల్)




ప్రమాదానికి కారణమైన డబుల్ డెక్కర్ బస్సు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పదవ తరగతి పరీక్ష రాసి తన సోదరుడితో కలిసి ఇంటికి తిరిగి వస్తున్న విద్యార్థిని అనుకోని ప్రమాదంలో ప్రాణాలు విడిచింది. పరీక్ష అనంతరం తన సోదరుడితో కలిసి ద్విచక్రవాహనం మీద వస్తున్న వీరిని, గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద వేగంగా వెనుక నుంచి వచ్చిన హెచ్ఎండిఏ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొట్టింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని టిఎన్జిఓ కాలనీలో పెనుదాస్ చత్రియా, సబితా చత్రియాలు తమ కుమారుడు సుమన్ ఛత్రియా, కుమార్తె ప్రభాతి ఛత్రియా(16) తో కలిసి నివాసం ఉంటున్నారు. ప్రభాతి ఛత్రియా విజయభారతీ స్కూల్లో 10వ తరగతి చదువగా, ప్రస్తుతం పదవ తరగతి పరీక్షల సెంటర్ రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పడింది. కాగా శనివారం ప్రభాతి ఛత్రియాకు పరీక్ష ఉండడంతో తన సోదరుడు సుమన్ పరీక్షా కేంద్రంలో వదిలిపెట్టాడు. పరీక్ష రాసిన అనంతరం తిరిగి సుమన్ తన సోదరి ప్రభాతితో కలిసి స్కూటీ ద్విచక్రవాహనం మీద ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీదకు వచ్చిన వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన హెచ్ఎండిఏ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ ఫ్రీ బస్సు (టీఎస్ 09 యూఈ 0491) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న సుమన్ ఎడుమ వైపు పడిపోగా, ప్రభాతి ఛత్రియా కుడివైపు పడిపోయింది. బస్సు వెనుక చక్రం ప్రభాతి ఛత్రియా మీద నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలతో విద్యార్థిని ప్రభాతి అక్కడికక్కడే మృతిచెందింది. సుమన్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ప్రభాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన హెచ్ఎండిఏ డబుల్ డెక్కర్ బస్సును, బస్సు నడుపుతున్న డ్రైవర్ బలరాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా భవిష్యత్తు పై ఎన్నో ఆశలతో పదవ తరగతి పరీక్షలకు హాజరై తిరిగి వస్తూ ప్రమాదంలో ప్రభాతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాదస్థలిలో పరీక్షా ప్యాడు, సామాగ్రిని చూసిన స్థానికులు కంటతడిపెట్టారు



నీటి పొదుపుపై నిర్వహించిన డిబేట్ లో పాల్గొన్న విద్యార్థులు


# కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలలో వరల్డ్ వాటర్ డే కార్యక్రమం

**ఈ-కబురు శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గొలిదొడ్డి కేశవ నగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం వరల్డ్ వాటర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ వాటర్ ఏఐడి ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెయింటింగ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించి. విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు నిర్వహించిన డిబేట్ లో విద్యార్థులు పాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థులకు నీటి ఆవశ్యకతను వివరిస్తూ, నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంకుడు గుంతలపై తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని, భవిష్యత్తులో నీటి కష్టాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.




కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలలో వరల్డ్ వాటర్ డే కార్యక్రమం

# మాదాపూర్ లో నాలా మీద నవజాత శిశువు మృతదేహం



డ్రైనేజీ నాలా మీద శిశువు మృతదేహం

**వర్షపు నీటిలో శిశువు మృతదేహం కొట్టుకువచ్చినట్లు అనుమానం దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** హైటెక్ సిటీ పరిధిలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఓ డ్రైనేజీ నాలా మీద నవజాత శిశువు మృతదేహం కనిపించడం సంచలనంగా మారింది. రోజుల వయస్సు ఉన్న నవజాత మగ శిశువు మృతదేహం లభించడంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకువచ్చిందా. లేక ఎవ్వరైనా కర్కశులు పారవేశారా అనే విషయంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మెడికవర్ ఉమెన్స్ ఆండ్ చైల్డ్ ఆసుపత్రి సమీపంలో గల నాలా మీద ఓ నవజాత మగ శిశువు మృతదేహం పడిఉంది. శనివారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో మెడికల్ హాస్పిటల్లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది నమాజ్ కోసం వెళ్తూ డ్రైనేజీ నాలా మీద ఉన్న శిశువు మృతదేహాన్ని గుర్తించి ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ కు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే శిశువు మృతి చెందినట్లు ధృవీకరించాడు. రోజుల వయస్సు ఉన్న నవజాత మగ శిశువు మృతదేహంపై పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న మాదాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా శిశువు మృతదేహం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకొని వచ్చి బస్ స్టాపు ముందు ఉన్న చెత్తతో నిలిచిపోయి ఉంటుందా, లేక ఎవ్వరైనా అక్కడే పడవేసి ఉంటారా అనే కోణంలో విచారిస్తున్నారు. ఈమేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## హైటెక్ సిటీలో రెస్టారెంట్లు, హోటళ్లపై కొనసాగుతున్న

# ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**గచ్చిబౌలి వరలక్ష్మి టిఫిన్ సెంటర్ లో ఎలుకల సంచారం**

**మాదాపూర్ క్షత్రియ రెస్టారెంట్ లో నిల్వ ఉంచిన మాంసం గుర్తింపు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** హైటెక్ సిటీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్ల మీద తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నా.. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల్లో చలనం రావడం లేదు. తాజాగా గచ్చిబౌలి డీఎల్ఎఫ్ రహదారిలో ఉన్న ప్రఖ్యాత వరలక్ష్మి టిఫిన్ సెంటర్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు నిర్వహించిన ఈ తనిఖీల్లో వరలక్ష్మి టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. హోటల్ కిచెన్ లో యదేచ్ఛగా ఎలుకలు సంచరిస్తున్నాయని, డ్రైనేజీలోనే ఆహార వ్యర్థాలను వేయడం వలన మురుగునీరు పొంగి దుర్వాసన వెదజల్లుతుందని అధికారులు తనిఖీల్లో బహిర్గతమైంది. కిచెన్‌లో విరిగిన ఫ్లోరింగ్ బండలు, గోడలకు నూనె మరకలు, మూతలు లేకుండా ఉన్న డస్ట్‌బిన్‌లు అధికారుల కంటబడ్డాయి. వంట వండే వారికి, అందించే వారికి హ్యాండ్‌గ్లవ్స్ లేవని గుర్తించారు. కుకింగ్ ఆయిల్‌ని మార్చకుండా వాడుతున్నారని అధికారులు తెలిపారు. ఎగ్జాస్ట్ ఫ్యాన్ నుంచి నూనె కారుతున్నట్లు అధికారులు గుర్తించారు. మాదాపూర్‌లోని క్షత్రియ ఫుడ్ రెస్టారెంట్ లో తనిఖీలు చేసిన అధికారులు ఆహారంలో సింథటిక్ రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. కిచెన్‌లోని రిఫ్రిజిరేటర్ అధ్వానంగా అందన్నారు. అందులోనే నిల్వ ఉంచిన చికెన్, మటన్ గుర్తించామని, సదరు మాంసం నుంచి రక్తం బయటకు కారుతుందని అధికారులు తెలిపారు.



వరలక్ష్మి టిఫిన్ సెంటర్లో మూతలేని ప్లాస్టిక్ బకెట్లలో నిల్వ ఉంచిన సామాగ్రి



క్షత్రియ రెస్టారెంట్లు నిల్వ ఉంచిన మాంసం

# వి వాంట్..డిస్కౌంట్

## దేశంలో 70శాతం అమ్మకాలను ప్రభావితం చేస్తున్న డిస్కౌంట్‌లు

**పండుగ ఆఫర్లు, డీల్స్ కోసం కొనుగోలుదారుల ఎదురుచూపులు**
**ఫెస్టివల్ సీజన్ ఆఫర్లు ప్రకటించినప్పుడు విపరీతంగా సేల్స్**
**2024లో పండుగ సీజన్లలోనే రూ.4.25 లక్షల కోట్ల కొనుగోళ్లు**
**ఆన్‌లైన్ షాపింగ్ పైనే ఎక్కువగా ఆసక్తి**
**కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా**




**ఈ-కబురు :** డిస్కౌంట్..కొద్దికాలంగా భారతీయులను అత్యంత ఎక్కువగా ఆకర్షించే పదం ఇది. గతంలో కంటే ఎక్కువగా వినియోగదారులు డిస్కౌంట్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా పండుగ సీజన్లలో ఇచ్చే డిస్కౌంట్ల కోసం చాలా కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. దేశంలో 70 శాతానికి పైగా అమ్మకాలు డిస్కౌంట్ల వల్లే జరుగుతున్నాయి. దుస్తులు, ఎలక్ట్రానిక్, గృహోపకరణ వస్తువులను 50 శాతానికిపైగా డిస్కౌంట్ ఉన్నప్పుడే ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు.
ఇలా 2024 పండుగ సీజన్లలోనే రూ.4.25 లక్షల కోట్ల అమ్మకాలు జరిగినట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది. ముఖ్యంగా దీపావళి, దసరా పండుగుల సీజన్లలో కొనుగోళ్లు ఇంకా ఎక్కువగా ఉంటున్నాయని, ఆ సమయంలో వివిధ బ్రాండ్లు ఇచ్చే డిస్కౌంట్లు, చేసే ప్రమోషన్లు కొనుగోళ్లను బాగా ప్రభావితం చేస్తున్నాయని వెల్లడించింది.

**మొబైల్ షాపింగ్‌కి పెరుగుతున్న ఆదరణ**
ఆన్‌లైన్ షాపింగ్‌లోనూ మొబైల్ షాపింగ్ అంతకంతకు పెరుగుతోంది. ఈ-కామర్స్ అమ్మకాలు పెరగడంలో మొబైల్ షాపింగ్ ఎక్కువగా ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. రిటైల్ అమ్మకాల్లో 50 శాతం మొబైల్ షాపింగ్ ద్వారానే జరుగుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఈ అమ్మకాల్లో ముందున్నాయి. ఇలాంటి సంస్థలు సోషల్ మీడియా ద్వారానే వినియోగదారులకు దగ్గరవుతున్నాయి. వారి అభిరుచులకు తగ్గట్టు వ్యూహాలు మార్చుకుంటూ అన్ని రకాల వస్తువుల అమ్మకాలను పెంచుకుంటున్నాయి.

**ఆన్‌లైన్ షాపింగ్‌కే ఓటు..**
గతంలో మాదిరిగా షాపులకు వెళ్లి కావాల్సినవి కొనుగోలు చేయడం కంటే ఇంట్లోనే కూర్చుని ఆఫర్లు ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి జనం ఆసక్తి చూపిస్తున్నారని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ వెల్లడించింది. డిస్కౌంట్‌తోపాటు డోర్ డెలివరీ అనేది కూడా కొనుగోలుదారులను ఆకర్షిస్తోందని తెలిపింది. ప్రజల అభిరుచి మేరకు వివిధ రకాల వస్తువులను అందించే ఆన్‌లైన్ స్టోర్‌లు, పోర్టల్స్ పెరిగిపోయాయి. రోజువారీ నిత్యావసర వస్తువుల నుంచి అత్యాధునిక సాంకేతికత వరకు అన్ని రకాల ఉత్పత్తులను సులభంగా కొనుగోలు చేయడానికి వీలు కల్పిస్తున్నాయి.

> **ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు పెరగడం వెనుక పండుగ షాపింగ్ అత్యంత కీలకంగా ఉంటోంది. సెలవుల సీజన్లలో వివిధ కంపెనీలు తరచూ కొత్త వాటితోపాటు పాత స్టాకుపై గణనీయమైన తగ్గింపులను ఇస్తున్నాయి. క్యాష్ బ్యాక్ డీల్స్, బై వన్– గెట్ వన్, బై టు–గెట్ త్రీ వంటి ఆఫర్లతో అదనపు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి**

ఫ్లిప్‌కార్ట్‌లో 'బిగ్ బిలియన్ డేస్', మింత్రాలో 'ఫ్లాష్ సేల్స్', అమెజాన్‌లో 'గ్రేట్ ఫెస్టివ్ సేల్' వంటి పేర్లతో విస్తృతంగా అమ్మకాలు చేపడుతున్నాయి. ఇలాంటి సంస్థల మార్కెటింగ్ వ్యూహాలు అమ్మకాల పెరుగుదలకు బాగా దోహదం చేస్తున్నాయి. దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలు, సెలవు రోజులు, ప్రజల మూడ్‌కు అనుగుణంగా భారతీయులకు దగ్గరవుతూ అమ్మకాలను ఈ సంస్థలు రోజురోజుకూ పెంచుకుంటున్నాయి.

## మణప్పురంలో బెయిన్‌కు వాటా

**రూ. 4,385 కోట్లతో 18 శాతం కొనుగోలు**
**మరో 26 శాతం వాటాకు ఓపెన్ ఆఫర్**
**షేరుకి రూ. 236 చొప్పున కొనుగోలుకి సై**
**ఆఫర్‌కు మరో రూ. 5,764 కోట్ల వెచ్చింపు**

**ఈ-కబురు న్యూఢిల్లీ:** పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ బంగారంపై రుణాలందించే మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 4,385 కోట్లు వెచ్చించనుంది. తద్వారా గోల్డ్ లోన్ కంపెనీ ప్రమోటర్ సంస్థలలో ఒకటిగా అవతరించనుంది. దీంతో నిబంధనల ప్రకారం సాధారణ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఒక్కో షేరుకి రూ. 236 చొప్పున ధర నిర్ధారించింది. ఇందుకు మరో రూ. 5,764 కోట్లు కేటాయించనుంది. వెరసి విసర్తించిన తదుపరి మణప్పురం ఫైనాన్స్ చెల్లించిన మూలధనంలో 41.7 శాతానికి బెయిన్ వాటా బలపడనుంది.

**6 నెలల సగటు ధర**
ప్రిఫరెన్షియల్ పద్ధతిలో బెయిన్‌కు ఈక్విటీతోపాటు..వారంట్లను మణప్పురం కేటాయించనుంది. గత ఆరు నెలల సగటు ధరకంటే 30% అధిక (ప్రీమియం) ధరతో వీటిని జారీ చేయనుంది. వీటితో విస్తరించనున్న కంపెనీ ఈక్విటీలో బెయిన్‌కు 18% వాటా లభించనుంది. తద్వారా మణప్పురం ఫైనాన్స్‌లో సహప్రమోటర్ కానుంది. దీంతో వారంట్లు మినహా మిగిలిన ఈక్విటీ నుంచి సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఆఫర్ పూర్తిగా విజయవంతమైతే బెయిన్ వాటా వారంట్ల మార్పిడి తదుపరి 41.7%కి బలపడనుంది. ఇదే సమయంలో ప్రస్తుత ప్రమోటర్ల వాటా 28.9 %కి చేరనుంది. అయితే ఈ లావాదేవీలకు నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించవలసి ఉంది.
1949లో ఆవిర్భావం: ఎన్‌బీఎఫ్‌సీ..మణప్పురం ఫైనాన్స్ 1949లో కేరళలో ఏర్పాటైంది. 5,357 బ్రాంచీలుసహా 50,795 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తూ మైక్రో, వాహన, గృహ, ఎస్ఎంఈ ఫైనాన్స్‌లోకి సైతం విస్తరించింది.

**షేరు 8 శాతం జూమ్...**
సాధారణ వాటాదారులకు బెయిన్ క్యాపిటల్ ఓపెన్ ఆఫర్ ప్రకటించిన నేపథ్యంలో మణప్పురం ఫైనాన్స్ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేరు 7.7 శాతం జంప్‌చేసి రూ. 234 వద్ద ముగిసింది. ఒక దశలో 14 శాతం దూసుకెళ్లి రూ. 248కు



## 3.3 సెకన్లలో 0100 kmph.. ఆస్టన్ మార్టిన్ నుంచి ₹8.85 కోట్ల కారు!

**ఈ-కబురు :** ఆస్టన్ మార్టిన్ కొత్త కారును భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.8.85 కోట్లుగా కంపెనీ నిర్ణయించింది.
బ్రిటిష్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆస్టన్ మార్టిన్ కొత్త కారును లాంచ్ చేసింది. వాన్క్విష్ పేరిట భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధరను రూ.8.85 కోట్లుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా హై పర్ఫార్మెన్స్ స్పోర్ట్స్ కార్లను కేవలం 1000 యూనిట్లనే ఉత్పత్తి చేయనుంది. భారత్‌లో కొందరు ఎంపిక చేసిన కస్టమర్లను దృష్టిలో పెట్టుకుని ఈ కారును తీసుకొచ్చింది. అదిరిపోయే లుక్‌తో ఎంట్రీ ఇచ్చిన వాన్క్విష్ గురించి వివరాలు ఇవీ..
5.2 లీటర్ ట్విన్ టర్బో వీ12 ఇంజిన్‌తో ఆస్టన్ మార్టిన్ ఈ స్పోర్ట్స్ కారును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఇంజిన్ 823hp, 1,000 Nm పీక్ టార్క్‌ని ఉత్పత్తి చేస్తుంది. 8 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తోంది. కేవలం 3.3 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గరిష్ఠంగా గంటకు 345 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.
ఆస్టన్ మార్టిన్ తీసుకొచ్చిన మోడళ్లలో ఇది ఒకటి. వెడల్పాటి వీల్ బేస్‌తో ఈ కారును తీసుకొచ్చారు. దీంతో మెరుగైన రైడ్ అనుభూతిని పొందొచ్చని కంపెనీ తెలిపింది. ఇంటిగ్రేటెడ్ బ్రేక్ స్లిప్ కంట్రోల్ , ఇంటిగ్రేటెడ్ ట్రాక్షన్ కంట్రోల్ , ఇంటిగ్రేటెడ్ వెహికల్ కంట్రోల్ , ఇంటిగ్రేటెడ్ వెహికల్ డైనమిక్స్ ఎస్టిమేషన్ వంటి ఏబీఎస్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. కారు ముందు భాగంలో మ్యాట్రిక్స్ ఎల్ఈడీ లైట్లు అమర్చారు. ఫ్లష్ డోర్ హ్యాండిల్స్‌తో దీన్ని తీసుకొచ్చారు.

## టాటా పవర్ సోలార్ రూఫ్‌టాప్ కొత్త మైలురాయి



**ఈ-కబురు** దేశంలోనే నంబర్ వన్ రూఫ్‌టాప్ సోలార్ ప్రొవైడర్‌గా స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటూ టాటా పవర్ దేశవ్యాప్తంగా 1,50,000 రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ల మైలురాయిని అధిగమించింది. దేశవ్యాప్తంగా రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ల మొత్తం సామర్థ్యం ఇప్పుడు సుమారు 3 గిగా వాట్లకు చేరింది. భారతదేశ పునరుత్పాదక విద్యుత్ పరివర్తనలో కంపెనీ పోషిస్తున్న కీలక పాత్రకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.
దేశంలోని 700 పైచిలుకు నగరాల్లో కార్యకలాపాలతో టాటా పవర్ రెన్యువబల్ ఎనర్జీ లిమిటెడ్‌లో భాగమైన టాటా పవర్ సోలార్ రూఫ్‌టాప్, సుస్థిరమైన, విద్యుత్తును ఆదా చేసే భవిష్యత్ దిశగా భారత్ సాగిస్తున్న ప్రస్థానంలో ముందువరుసలో ఉంటోంది.కంపెనీ తమ తమిళనాడు ఫ్యాక్టరీలో ఏఎల్ఎంఎం ఆమోదిత సోలార్ ప్యానెళ్లను తయారు చేస్తోంది.
ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు సహా 20 పైగా ఆర్థిక భాగస్వాముల ద్వారా టాటా పవర్ సరళతరమైన ఫైనాన్సింగ్ సొల్యూషన్స్ అందిస్తోంది. తద్వారా సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత చౌకగా, అందరికీ అందుబాటులోకి తెస్తోంది. ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వంటి పథకాలు, తమ ఫ్లాగ్‌షిప్ 'ఘర్‌ఘర్ సోలార్' ప్రచార కార్యక్రమాలు మొదలైన వాటి ద్వారా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల అమల్లో కంపెనీ కీలక పాత్ర పోషిస్తోంది.
టాటా పవర్ సోలార్ రూఫ్‌టాప్ కంపెనీకి దేశవ్యాప్తంగా 300 పైచిలుకు నగరాల్లో 575 పైగా చానల్ పార్ట్‌నర్లు, 400 పైగా నగరాల్లో 225 పైగా అధీకృత సర్వీస్ భాగస్వాములు ఉన్నారు. రెసిడెన్షియల్ రంగంలో 1,22,000 పైగా వినియోగదారులు సహా 1.5 లక్షలకు పైగా కస్టమర్ల బేస్‌తో కంపెనీ పటిష్టమైన స్థానాన్ని దక్కించుకుంది.




## ఇళ్లకు జీఎస్టీ.. ఎవరు కట్టాలి?

**ల్యాండ్ ఓనర్, బిల్డర్ల మధ్య సందిగ్ధం**
**కొత్తవైనా, రీ-డెవలప్‌మెంట్ అయినా 5 శాతం జీఎస్టీ**

**ఈ-కబురు :** హైదరాబాద్ నగరంలో గృహాలకు డిమాండ్ పెరుగుతోంది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతి కారణంగా కొత్త ప్రాంతాలలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. మరోవైపు ప్రధాన నగరంలో స్థలం కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం మినహా నిర్మాణదారులకు ప్రత్యామ్నాయం లేదు.

ఖైరతాబాద్, అబిడ్స్, బేగంపేట, సనత్‌నగర్, ఈఎస్ఐ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండిపెండెంట్ హౌస్‌లు, నాలుగైదు అంతస్తుల అపార్ట్‌మెంట్లను కూల్చేసి ఆ స్థలంలో హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూయజమానులు, ఫ్లాట్ ఓనర్లతో బిల్డర్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంటారు. ఖాళీ స్థలాలను అభివృద్ధికి తీసుకుంటే 50 నుంచి 40 శాతం, ప్రాంతాన్ని బట్టి 60 శాతం ఫ్లాట్లను భూయజమానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారు. మిగిలిన వాటినే డెవలపర్ అమ్ముకుంటాడు.




కూల్చి కట్టినా, ఖాళీ ప్రదేశంలో కొత్త భవనాలు కట్టినా పూర్తయిన ఇళ్లకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. భూయజమాని వాటా కింద వచ్చిన జీఎస్టీ ఎవరు చెల్లించాలనే అంశంపై ల్యాండ్ ఓనర్లకు, బిల్డర్లు మధ్య వాగ్వాదం నెలకొంటుంది. డెవలపర్ చెల్లించాలని భూయజమాని, ల్యాండ్ ఓనరే కట్టాలని బిల్డర్ల మధ్య సందిగ్ధం నెలకొంది.
భవనం కట్టడంతో స్థలం విలువ పెరిగిందని, దీంతో 5 శాతం జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం బిల్డర్‌కు నోటీసులు పంపిస్తుంది. వాస్తవానికి కొత్తవైనా, పాతవైనా భవనానికి జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే. కాకపోతే భూయజమాని, కస్టమర్ల నుంచి బిల్డర్ జీఎస్టీ వసూలు చేసి కట్టాల్సింది డెవలపరే.

## స్విస్ వాచీల స్టోర్స్ విస్తరణ.. కొత్తగా మరో ఆరు




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్విస్ లగ్జరీ వాచీల దిగ్గజం బ్రైట్‌లింగ్ వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో కొత్తగా ఆరు బొటిక్ స్టోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. దీంతో వీటి సంఖ్య 10కి చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు పుణె తదితర నగరాల్లో నాలుగు బొటిక్ స్టోర్స్ ఉన్నట్లు బ్రైట్‌లింగ్ ఇండియా ఎండీ ప్రదీప్ భానోత్ తెలిపారు.
దేశీయంగా స్విస్ వాచీల మార్కెట్ సుమారు రూ. 2,500 కోట్లుగా ఉంటోందని ఆయన చెప్పారు. పరిశ్రమ ఏటా సుమారు 15 శాతం ఎదుగుతుండగా, తాము అంతకు మించి వృద్ధిని నమోదు చేస్తున్నట్లు ప్రదీప్ చెప్పారు. స్మార్ట్ వాచీలు వచ్చినప్పటికీ .. హోదాకు నిదర్శనంగా ఉండే బ్రైట్‌లింగ్‌లాంటి లగ్జరీ వాచీల ప్రాధాన్యతను గుర్తించే వారు పెరుగుతున్నారని ఆయన తెలిపారు.
అలాగే వాటిపై ఖర్చు చేసే సామర్థ్యాలు పెరుగుతుండటం కూడా వ్యాపార వృద్ధికి దోహదపడనుందని వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్ స్టోర్‌లో సుమారు రూ. 3.11 లక్షల నుంచి సుమారు రూ. 17 లక్షల పైచిలుకు విలువ చేసే వాచీలు అందుబాటులో ఉన్నాయి. 140 ఏళ్ల బ్రైట్‌లింగ్ చరిత్రలో అత్యంత ప్రాధాన్యమున్న వాచీలను ఇందులో మార్చి 25 వరకు ప్రదర్శిస్తున్నారు.

# కోపం వస్తే తెలుగులోనే తిడతా!

పదిహేనేళ్ల వయసులోనే కెమెరా ముందుకు వచ్చేసింది మిల్కీ బ్యూటీ తమన్నా. హీరోయిన్‌గా ఎన్నో సినిమాలు చేసింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఓదెల 2. ఇది 2021లో వచ్చిన ఓదెల రైల్వే స్టేషన్‌కు సీక్వెల్‌గా తెరకెక్కింది. హెబ్బా పటేల్, వశిష్ట సింహ కీలక పాత్రలు పోషించారు. సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ దర్శకత్వం వహించాడు.శనివారం నాడు ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. ఏప్రిల్ 17న ఓదెల 2 ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అందులో తమన్నా ముఖం రక్తసిక్తంగా కనిపిస్తోంది. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ.. అందరూ నన్ను తెలుగమ్మాయే అనుకుంటారు. నేను కూడా అలాగే ఫీలవుతాను. నాకు కోపం వచ్చినప్పుడు తెలుగే మాట్లాడతాను. తెలుగులోనే తిడతాను అని చెప్పుకొచ్చింది. ఇకపోతే ఓదెల 2 కోసం తమన్నా మాంసాహారం తినడం కూడా మనేసింది.



# యష్ 'టాక్సిక్' రిలీజ్ డేట్ ఫిక్స్

'కేజీఎఫ్' పేరుతో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, హీరో యష్ గుర్తొస్తారు. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన రెండు సినిమాలతో వీళ్ల కెరీరే మారిపోయింది. ప్రస్తుతం నీల్.. తారక్ తో మూవీ చేస్తుండగా, యష్ 'టాక్సిక్' అనే చిత్రంలో నటిస్తున్నాడు.

మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తీస్తున్న 'టాక్సిక్'.. భారీ స్థాయిలో తీస్తున్నారు. కొన్నిరోజుల క్రితం బెంగళూరులో షూటింగ్ వల్ల ఈ మూవీ వివాదంలోనూ చిక్కుకుంది. సరే ఇవన్నీ పక్కనబెడితే ఇప్పుడు చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 19న థియేటర్లలోకి వస్తామని పేర్కొన్నారు. మార్చిలో అంటే పరీక్షల సీజన్. అయినా సరే యష్ వస్తున్నాడంటే సాహసమనే చెప్పాలి. మరోవైపు తర్వాత వారమే అంటే మార్చి 26న నాని 'ప్యారడైజ్' రిలీజ్ కానుంది. మరోవైపు రామ్ చరణ్‌బుచ్చిబాబు ప్రాజెక్టుని కూడా 26నే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ఒకవేళ ఇది ఫిక్స్ అయితే మాత్రం 'టాక్సిక్' వల్ల చరణ్ కి కాస్త ఇబ్బంది ఉండొచ్చు. ఎందుకంటే యష్, చరణ్.. ఇద్దరివీ పాన్ ఇండియా మూవీసే. వారం గ్యాప్ లో ఈ రెండు సినిమాలు రిలీజై హిట్ అయితే పర్లేదు. లేదంటే మాత్రం ఒకరి వల్ల మరొకరికి వసూళ్లపై దెబ్బ పడే ఛాన్స్ ఉండొచ్చు.






# హద్దులు దాటి అసభ్యంగా.. కరెక్ట్ కాదు!

హీరోయిన్లు చాలామంది సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తుంటారు. ఈ క్రమంలో ఛాన్సుల్ని అందుకునే విషయంలో పలు సవాళ్లు ఎదురవుతుంటాయి. కానీ నిధి అగర్వాల్ కి మాత్రం తొలి మూవీ చేసేటప్పుడు వింతైన కండీషన్ పెట్టారట. అది చూసి ఈమె షాకైందట.

''మున్నా మైకేల్' మూవీతో నా కెరీర్ మొదలైంది. ఇదో బాలీవుడ్ మూవీ. టైగర్ ష్రాఫ్ హీరో. ఈ సినిమాకు ఓకే చెప్పిన తర్వాత నాతో ఓ కాంట్రాక్ట్ పై సంతకం చేయించారు. అందులో నో డేటింగ్ అనే కండీషన్ కూడా ఉంది. అంటే సినిమా పూర్తయ్యేవరకు హీరోతో నేను డేటింగ్ చేయకూడదన మాట.కాంట్రాక్ట్ మీద సంతకం పెడుతున్నప్పుడు ఇవన్నీ గమనించలే గానీ తర్వాత వీటి గురించి తెలిసి ఆశ్చర్యపోయాను' అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది.

ప్రస్తుతం తెలుగులో హరిహర వీరమల్లు, రాజాసాబ్ సినిమాలు చేస్తున్న నిధి.. ట్రోలింగ్ గురించి కూడా మాట్లాడింది. 'మంచి, చెడు చెప్పడానికి పద్ధతి ఉంది. హద్దులు దాటి అసభ్యంగా మాట్లాడటం మాత్రం సరికాదు. నేను అస్సలు ఇలాంటివి పట్టించుకోను' అని నిధి చెప్పుకొచ్చింది



# హీరోలకు మాకూ అదే తేడా: పూజాహెగ్డే


**సినిమా ఇండస్ట్రీలో పురుషాధిక్యంపై కథానాయిక పూజాహెగ్డే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే, అది వివిధ స్థాయుల్లో ఉంటుందని అభిప్రాయపడ్డారు.**

సినిమా సెట్స్‌లో తనకూ వివక్ష ఎదురైనట్లు కథానాయిక పూజా హెగ్డే తెలిపింది. తెలుగుతో పాటు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర కథానాయకుల సరసన నటించిన పూజా స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. ఒకప్పుడు వరుస అవకాశాలను అందిపుచ్చుకున్న ఆమె ప్రస్తుతం స్క్రిప్ట్‌ల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

తోటి నటుల కారణంగా ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ "ఇది అన్ని పరిశ్రమల్లోనూ ఉంది. అయితే, ఒక్కో చోట ఒక్కోరకంగా ఉంటుంది. పరిస్థితులను బట్టి దాని స్థాయిలు మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు హీరో వ్యానిటీ వ్యాన్ మూవీ షూటింగ్ జరిగే సెట్‌కు పక్కనే నిలిపి ఉంచుతారు. మిగిలిన వాళ్లవి దూరంగా ఉంటాయి. మేము బరువైన కాస్ట్యూమ్స్, భారీ లెహంగాలు ధరించి సెట్ వరకూ నడుచుకుంటూ రావాలి. కొన్నిసార్లు అది చూడటానికి బాగున్నా, అంత బరువైన దుస్తులను ఈడ్చుకుంటూ వచ్చి, షాట్ అయ్యాక అలాగే వెళ్లాల్సి ఉంటుంది. ఇదొక రకమైన వివక్ష"

"ఇంకొన్ని సార్లు పోస్టర్‌లో మా పేరు కూడా ఉండదు. లవ్‌స్టోరీలో నటించినా ఎలాంటి గుర్తింపు ఇవ్వరు. సినిమా అనేది సమష్టి కృషి అన్న విషయం అందరూ గుర్తించాలి. అందరూ నా అభిమాన హీరోలే. అయితే, అనుష్కశర్మ అంటే నాకెంతో ఇష్టం. ఎందుకంటే ఆమె వ్యక్తిత్వానికి నేను దగ్గరగా ఉంటా. ఒకప్పుడు ఇండస్ట్రీలో ఆమెకు ఎలాంటి సపోర్ట్‌లేదు. ఆమెలానే నాక్కూడా పార్టీలంటే ఇష్టం ఉండదు. 'అచ్చం నాలాంటి వారు ఒకరు ఉన్నందుకు సంతోషం' అనిపిస్తుంది. హాలీవుడ్‌లో స్కార్లెట్ జాన్సన్ అంటే ఇష్టం" అని పూజా హెగ్డే చెప్పుకొచ్చింది. దశాబ్దాలుగా అగ్ర కథానాయకులుగా కొనసాగుతూ భారీ పారితోషికం అందుకుంటున్న వారితో కలిసి నటించినా, తనని తాను రెండో తరగతి పౌరురాలిగానే చూసుకుంటానని తెలిపింది. అలాగే, హీరోయిన్లు భారీ పారితోషికం అందుకుంటున్నారంటే ముందుగా సంతోషపడేది తానేనని చెప్పుకొచ్చింది. ఇక పూజా సినిమాల విషయానికొస్తే, గతేడాది ఆమె అసలు తెరపైనే కనిపించలేదు. ప్రస్తుతం ఆమె వరుస చిత్రాలు చేస్తున్నారు. ఈ ఏడాది షాహిద్‌కపూర్ 'దేవ'లో కనిపించింది. ప్రస్తుతం సూర్యతో 'రెట్రో', లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ', రాఘవ లారెన్స్ 'కాంచన 4' సహా విజయ్‌తో కలిసి 'జన నాయగన్'లో పూజా నటిస్తోంది.

# ప్రముఖ బ్రాండ్ ప్రచారకర్తలుగా మహేష్, సితార



దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ రిటైల్ బ్రాండ్లలో ఒకటైన రిలయన్స్ ట్రెండ్స్ సూపర్ స్టార్ మహేష్ బాబు, ఆయన కుమార్తె సితార ఘట్టమనేనిను బ్రాండ్ ప్రచారకర్తలుగా నియమించుకుంది. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా తయారు చేసిన దుస్తులను వీరు ప్రమోట్ చేయనున్నారు. 'న్యూ టైమ్స్, న్యూ ట్రెండ్స్' పేరుతో బ్రాండ్ ప్రచారానికి వీరు ఎంతో తోడ్పడుతారని కంపెనీ తెలిపింది.

**ప్రమోషన్‌లో స్టార్లు అవసరమేనా..?**

సంస్థలు తమ ఉత్పత్తులను వినియోగదారుల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా ప్రస్తుతం సెలబ్రిటీల బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు కంపెనీలకు కీలకంగా మారాయి. అయితే బ్రాండ్ ప్రమోషన్ కోసం సంస్థలు సెలబ్రిటీలను ఎందుకు ఎంచుకుంటున్నాయో తెలుసుకుందాం.

నమ్మకం, విశ్వసనీయతను పెంపొందించడం: సెలబ్రిటీలను తరచుగా రోల్ మోడల్స్ లేదా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా భావిస్తారు. కాబట్టి తాము ప్రచారం చేస్తున్న బ్రాండ్ పట్ల వినియోగదారులకు సానుకూలత రావడానికి, దాన్ని వినియోగించేందుకు అవకాశం ఉంటుంది. ఇది కంపెనీల సేల్స్ పెరిగేందుకు దోహదం చేస్తుంది.

బ్రాండ్ విజిబిలిటీని పెంచడం: సెలబ్రిటీ ప్రమోషన్ల ద్వారా స్టార్ల ఫాలోయింగ్‌ను కంపెనీలు ఆసరాగా చేసుకుంటాయి. దాంతో బ్రాండ్ ఉత్పత్తుల విజిబిలిటీని పెంచాలని లక్ష్యంగా చేసుకుంటాయి. ముఖ్యంగా ఫ్యాషన్, స్పోర్ట్స్, టెక్నాలజీ వంటి రంగాల్లో ఇది ప్రభావం చూపుతుంది.

ఎమోషనల్‌గా కనెక్ట్ చేయడం: అభిమానులు తరచుగా తమ ఫేవరెట్ స్టార్‌లతో పరోక్షంగా భావోద్వేగ బంధాన్ని కలిగి ఉంటారు. సెలబ్రిటీలు ఒక బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నప్పుడు ఆయా ఉత్పత్తులపై వినియోగదారుల భావోద్వేగాలు తోడవుతాయి. దాంతో కంపెనీ సేల్స్ పెరిగే అవకాశం ఉంటుంది.

**సవాళ్లు లేవా..**

సెలబ్రిటీల బ్రాండ్ ప్రమోషన్లలో కంపెనీలకు ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. స్టార్ల జీవన విధానం బ్రాండ్లపై ప్రభావం చూపుతుంది. కాంట్రాక్ట్ కుదుర్చుకున్న తర్వాత ఆ సెలబ్రిటీలు ఏదైనా వివాదాల్లో చిక్కుకుంటే కంపెనీ ఉత్పత్తులపై దాని ప్రభావంపడే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇది బ్రాండ్ ప్రతిష్ఠను దెబ్బతీయవచ్చు. అందువల్ల సెలబ్రిటీ ఎంపిక కీలకంగా మారుతుంది.



## పుల్‌షాట్లు కొడుతూ... హిట్‌మ్యాన్‌ని మరిపిస్తున్న చిన్నారి

**పాకిస్థాన్‌కు చెందిన ఆరేళ్ల చిన్నారి టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్టైల్లో క్రికెట్ ఆడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.**

**ఈ-కబురు :** టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మకు భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. అయితే పాకిస్థాన్ కు చెందిన ఆరేళ్ల చిన్నారి అభిమాని హిట్‌మ్యాన్‌ను అనుకరించి అద్భుతమైన పుల్ షాట్లతో క్రికెట్ ఆడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో పాకిస్థాన్‌కు చెందిన చిన్నారి సోనియా ఖాన్ పుల్ షాట్లను కొడుతున్న దృశ్యాలు చూసి.. క్రికెట్ అభిమానులు అబ్బురపడుతున్నారు. ఆమెను హిట్‌మాన్‌తో పోల్చడం పెద్ద విషయం అయినప్పటికీ..ఈ చిన్నారి ఎప్పటికైనా ఆయన స్థాయికి చేరుతుందని నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## ఇలా అన్నందుకు సారీ.. స్పిన్నర్లూ ఫాస్ట్ బౌలర్లుగా మారారు: హర్భజన్

**ఐపీఎల్ 2025 సీజన్ ఇవాళ్టి నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో హర్భజన్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టీ20ల్లో స్పిన్నర్లు వికెట్లను లక్ష్యంగా చేసుకొని బంతులేయాలని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు.**

**ఈ-కబురు :** ఐపీఎల్‌లో స్పిన్నర్ల ప్రభావం చాలా ఎక్కువ. మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడంతోపాటు పరుగులను నియంత్రించడం వారి బాధ్యత. కానీ, ఇటీవల స్పిన్నర్లు కేవలం పరుగులను అడ్డుకోవడం పైనే దృష్టిపెడుతున్నారని.. వికెట్లు తీయడం మరిచిపోయినట్లుందని భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు. ఫాస్ట్ బౌలర్లలా మారిపోయారని పేర్కొన్నాడు. టీ20ల్లో పిచ్‌లు బ్యాటింగ్ ఫ్రెండ్లీగా ఉంటాయని... స్పిన్నర్లే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపాడు.

"నేను ఈ మాట అంటున్నందుకు నన్ను క్షమించండి. ఇటీవల టీ20ల్లో స్పిన్నర్లు కూడా ఫాస్ట్ బౌలర్ల మాదిరిగా బౌలింగ్ చేస్తున్నారు. ఎటాకింగ్‌గా బంతులేయడం లేదు. వికెట్లు తీయాలనే లక్ష్యం కనిపించడం లేదు. అందుకే, ఇంకాస్త ధైర్యంగా బౌలింగ్ వేయడం నేర్చుకోవాలి. అవకాశాలను సృష్టించుకోవాలి. బంతిని స్పిన్ చేయాలి. ఫ్లైట్ డెలివరీలు వేసి వికెట్లను టార్గెట్ చేయాలి. ఇక ఉమ్మిని వాడుకోవడంపై అవకాశం ఇవ్వడం బౌలర్లకు సహకరిస్తుంది. త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌లోనూ చూస్తామని ఆశిస్తున్నా. పేసర్లు స్వింగ్ రాబట్టవచ్చు. స్పిన్నర్లకు పట్టు దక్కుతుంది" అని హర్భజన్ తెలిపాడు.

**కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం బాగుంది..**

"ప్రతి సంవత్సరం ఐపీఎల్ చాలామంది యువ క్రికెటర్లను వెలుగులోకి తీసుకొస్తుంది. ఇప్పుడు నా కళ్లన్నీ రియాన్ పరాగ్‌పైనే ఉన్నాయి. అతడి సారథ్యంలో అసోం అద్భుతంగా ఆడింది. పరాగ్‌లో అద్భుతమైన టాలెంట్ ఉంది. నిరంతరం ఎదుగుతూనే ఉన్న అతడు పెద్ద స్టార్‌గా ఎదగాలని కోరుకుంటున్నా. ఐపీఎల్‌లో ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా ఉంది" అని భజ్జీ వ్యాఖ్యానించాడు.

**ఆ పోరు.. భారత్ - పాక్ మ్యాచ్‌లాంటిదే..**

"ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య పోరు భారత్ పాక్ మ్యాచ్‌లా ఉంటుంది. ముంబయి, చెన్నై ఇప్పటికే చెరో ఐదేసి టైటిళ్లను గెలిచాయి. ఇరు జట్ల ఫ్యాన్స్ కూడా విపరీతంగా అభిమానం చూపిస్తారు. ఒకసారి చెన్నై గెలిస్తే.. మరొకసారి ముంబయి పైచేయి సాధించడం చూస్తున్నాం. ఈసారి సీజన్‌లోనూ వీరి మధ్య పోరు రసవత్తరంగా ఉండటం ఖాయం" అని వ్యాఖ్యానించాడు. ఆదివారం సీఎస్కే ముంబయి జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

## కష్టాలన్నీ తొలగాయి.. హార్దిక్‌ను ఆపడం కష్టమే: ముంబయి మాజీ కోచ్

**భారత జట్టులో కీలక ఆల్‌రౌండర్‌గా రెండు ఐసీసీ ట్రోఫీలను గెలిపించిన హార్దిక్ పాండ్యను ఈసారి ఐపీఎల్‌లో అడ్డుకోవడం చాలా కష్టమని మాజీ కోచ్ బౌచర్ వ్యాఖ్యానించాడు.**



**ఈ-కబురు :** ఐపీఎల్ 2024.. హార్దిక్ పాండ్యకు ఎన్నో నిద్ర లేని రాత్రులు మిగిల్చిన సీజన్. గుజరాత్ టైటాన్స్‌ను వదిలి ముంబయి జట్టుకు సారథిగా వచ్చాడు. దీంతో రోహిత్‌ను పక్కనపెట్టి మరీ కెప్టెన్సీ తీసుకోవడంతో ఫ్యాన్స్ విమర్శలు గుప్పించారు. ప్రతి మ్యాచ్ సందర్భంలోనూ ఎగతాళి చేశారు. అయితే, గత టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత పాండ్యపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపించడం గమనార్హం. టీమ్‌ఇండియా విజేతగా నిలవడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. దీంతో ఈసారి ఐపీఎల్ లో పాండ్యకు గత అనుభవం ఎదురవదని మాజీ కోచ్ మార్క్ బౌచర్ వ్యాఖ్యానించాడు. 2024 ఐపీఎల్ సీజన్‌లో ముంబయికి అతడే కోచ్‌గా వ్యవహరించాడు. "హార్దిక్ పాండ్య కు గతేడాది చాలా క్లిష్టమైన సీజన్. మైదానంలో ఎక్కడ కనిపించినా ప్రేక్షకులు హేళన చేశారు. అతడు వాటన్నింటిని భరించాడు. ఇప్పుడు దక్కుతున్న గౌరవానికి వందశాతం అర్హుడే. జీవితంలో ఏ క్రికెటరూ అలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలని భావించడు. కానీ, హార్దిక్ యుద్ధం చేసినట్లు శ్రమించే క్రికెటర్. క్లిష్టమైన సమయాలు, గాయాలు, ఫామ్.. ఇలా ఎన్నో అవాంతరాలను దాటుకొని వచ్చాడు" అని బౌచర్ వెల్లడించాడు. పాండ్య నాయకత్వంలోని ముంబయి ఇండియన్స్ ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్‌కు హార్దిక్ దూరం కానున్నాడు. గతేడాది ముంబయి ఆడిన చివరి మ్యాచ్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఒక మ్యాచ్ నిషేధం పడింది. దీంతో సీఎస్కేతో పోరుకు పాండ్య బదులు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తాడు.

**నిర్భయంగా ఉండే తత్వం: హర్భజన్**

" హార్దిక్ పాండ్య నమ్మకమైన ప్లేయర్. పాజిటివ్ దృక్పథం ఎక్కువ. ఆత్మవిశ్వాసంతో ఏ పనినైనా అలవోకగా చేసేస్తాడు. అదే ఇతరుల నుంచి పాండ్యను వేరు చేస్తుంది. గతేడాది అతడు ఎదుర్కొన్న వాటిని చూస్తే చాలా బాధేసింది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. రెండు ఐసీసీ ట్రోఫీలను టీమ్‌ఇండియా నెగ్గడంలో పాండ్య పాత్ర ఉంది. ప్రస్తుత సంవత్సరంలో పాండ్య అత్యుత్తమ స్థితిలో ఉన్నాడు. పొరపాట్లన్నీ గతేడాది ముగిసిపోయాయి. ఇప్పుడు కొత్తగా ప్రారంభించనున్నాడు" అని భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు.

# డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతాకు షాక్ ఇచ్చిన ఆర్సీబీ

**ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బోణీ కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.**




**ఈ-కబురు కోల్‌కతా:** ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బోణీ కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను వారి సొంతగడ్డపై 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 175 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బెంగళూరు 16.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ(59*; 36 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (56; 31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో చెలరేగారు. కెప్టెన్ రజత్ పటీదార్ (34: 16 బంతుల్లో) రాణించాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ ఒక్కో వికెట్ తీశారు.

**రాణించిన రహానె..**

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్య రహానె (56; 31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. సునీల్ నరైన్ (44; 26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా మెరిశాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ (30; 22 బంతుల్లో 2 సిక్స్‌లు, 1 ఫోర్) రాణించాడు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. బెంగళూరు బౌలర్లలో కృనాల్ పాండ్య 3, హేజిల్ వుడ్ 2, సుయాశ్ శర్మ, రసిఖ్ సలామ్, యశ్ దయాల్ తలో వికెట్ తీశారు.




కోల్‌కతాకు గొప్ప ఆరంభమేమీ దక్కలేదు. హేజిల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే క్వింటన్ డికాక్ (4) వెనుదిరిగాడు. తర్వాతి రెండు ఓవర్లలో పెద్దగా పరుగులు రాకపోవడంతో మూడు ఓవర్లకు స్కోరు 9/1గా ఉంది. ఈ క్రమంలోనే రసిఖ్ సలామ్ వేసిన నాలుగో ఓవర్‌లో రహానె రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాది జోరందుకున్నాడు. కృనాల్ బౌలింగ్‌లో సిక్స్ బాది నరైన్ కూడా ఊపందుకోగా.. రహానె రెండు బౌండరీలు రాబట్టాడు. యశ్ దయాల్ వేసిన ఆరో ఓవర్‌లో అజింక్య వరుసగా 4, 6, 4 బాదేసి హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. సుయాశ్ శర్మ బౌలింగ్‌లో సిక్స్ బాదిన రహానె 25 బంతుల్లోనే అర్ధ శతకం చేశాడు. రసిఖ్ సలామ్ వేసిన పదో ఓవర్‌లో ఫోర్, సిక్స్ కొట్టిన నరైన్.. అదే ఓవర్‌లో జితేశ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అక్కడి నుంచి కేకేఆర్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. స్వల్ప వ్యవధిలో రహానె, వెంకటేశ్ అయ్యర్ (6) వెనుదిరిగారు. రింకు సింగ్ (12), ఆండ్రీ రస్సెల్ (4) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు.

# తారలు దిగొచ్చిన వేళ.. అంగరంగ వైభవంగా.. అట్టహాసంగా..

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఆరంభ వేడుకలు అట్టహాసంగా సాగాయి. కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బాలీవుడ్ సెలబ్రిటీలు తమ ఆట, పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.**



**ఈ-కబురు :** డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్) జట్టు సహ యజమాని, బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మైదానంలో సందడి చేశఋడు. కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) సారథి రజత్ పాటిదార్‌లతో కాసేపు ముచ్చటించాడు.

అనంతరం వేదికపైకి వచ్చి తనదైన శైలిలో ప్రసంగించాడు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన క్రికెట్ లీగ్‌గా వెలుగొందుతున్న ఐపీఎల్‌లో భాగం కావడం సంతోషంగా ఉందని షారుఖ్ హర్షం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ తన గాత్రంతో ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. హిందీ పాటలతో పాటు పుష్ప 2 సినిమాలోని పాపులర్ సాంగ్ .."సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామీ".. తెలుగులో పాడటం విశేషం.ఆ తర్వాత స్టార్ హీరోయిన్ దిశా పటానీ హుషారైన స్టెప్పులతో అభిమానులను ఉర్రూతలూగించింది.



ఆ తర్వాత టీమిండియా, ఆర్సీబీ సూపర్‌స్టార్ విరాట్ కోహ్లిని షారుఖ్ స్టేజీ మీదకు ఆహ్వానించాడు. కోహ్లితో ముచ్చటించిన అనంతరం.. కేకేఆర్ యువ తార రింకూ సింగ్‌ను కూడా వేదిక మీదకు పిలిచాడు. ముగ్గురూ కలిసి కాసేపు స్టెప్పులు వేశారు. అనంతరం బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీతో పాటు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్‌లను వేదిక మీదకు ఆహ్వానించగా... ఐపీఎల్-18 కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

